రైల్వేస్టేషన్ రోడ్డు విస్తరణ పనులు వేగవంతం

- ఎమ్మెల్యే కన్నబాబు చొరవతో రోడ్డు విస్తరణ
- రూ.2.20 కోట్ల వీఎంఆర్‌డీఏ నిధులతో 0.65 కిలోమీటర్ల మేర ఆధునికీకరణ



సెంట్రల్ డివైడర్‌పై మొక్కలు పెంచడానికి వీలుగా వేస్తున్న ఇనుప కంచె



రూ.2.20 కోట్లతో ఆధునికీకరణ పనులు జరుగుతున్న రైల్వేస్టేషన్ రోడ్డు



అందంగా తీర్చిదిద్దుతున్న సెంట్రల్ డివైడర్ గ్రిల్స్

యలమంచిలి రూరల్ : పట్టణ పరిధిలో గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధికి నోచుకోని వివిధ పనులు పూర్తి చేసే దిశగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. పట్టణంలోని మెయిన్‌రోడ్డు తర్వాత ముఖ్యమైన రైల్వేస్టేషన్ రోడ్డు విస్తరణ అవసరాన్ని గుర్తించిన ఎమ్మెల్యే కన్నబాబు సీఎం వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సీఎం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో రహదారి ఆధునికీకరణకు రూ.2.20 కోట్ల వీఎంఆర్‌డీఏ (విశాఖపట్నం మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ) నిధులు మంజూరయ్యాయి. గతేడాది డిసెంబరు 28న స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రైల్వేస్టేషన్ వరకు విస్తరణ పనులకు ఎమ్మెల్యే కన్నబాబు శంకుస్థాపన చేశారు. సుమారు 0.65 కిలోమీటర్ల పొడవు, 14 మీటర్ల వెడల్పు (ఒక వైపు 7 మీటర్లు వెడల్పు)న రహదారి ఆధునికీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రహదారిలో ఉన్న రెండు కల్వర్టులను కూడా విస్తరించారు. సుమారుగా 29 అంగుళాల మందం ఉండేలా కాంక్రీటు వేస్తున్నారు. రహదారి మధ్యలో సెంట్రల్ డివైడర్‌ను మొక్కలు పెంచడానికి వీలుగా మీటరు ఎత్తులో ఇనుప గ్రిల్స్‌తో ఏర్పాటు చేస్తున్నారు. దీనిపై మున్సిపల్ అధికారులు విద్యుత్ లైట్లు వేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

నెలాఖరుకు పనుల పూర్తి

రైల్వేస్టేషన్ రోడ్డు ఆధునికీకరణ పనులు నెలాఖరుకు పూర్తి చేయడానికి వీఎంఆర్‌డీఏ అధికారులు ప్రయత్నిస్తున్నారు. పట్టణంలో ప్రధాన రహదారి తర్వాత నిత్యం రద్దీగా ఉండే రైల్వేస్టేషన్ రోడ్డు విస్తరణ పనులు పూర్తయితే ప్రజల రాకపోకలకు సౌకర్యవంతంగా ఉంటుంది. పెదపల్లి, రాంనగర్, ఏఎస్ఆర్ కాలనీ, ఎర్రవరం, మంత్రిపాలెం, గొల్లలపాలెం, వెంకటాపురం తదితర గ్రామాల ప్రజలకు రహదారి పనులు ఉపయుక్తంగా ఉంటాయి. గతంలో యలమంచిలి మేజర్ పంచాయతీగా ఉన్నపుడు 17 సంవత్సరాల క్రితం ఉమ్మడి రాష్ట్రంలో వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు రైల్వేస్టేషన్ రోడ్డు విస్తరణ పనులు జరిగాయి. అప్పట్లో రోడ్డు కిరువైపులా ఆక్రమణలు సైతం తొలగించి 40 అడుగుల మేర రహదారిని విస్తరించి బీటీరోడ్డు స్థానంలో సీసీ రోడ్డు నిర్మించారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలన్నీ పట్టణ అభివృద్ధిని నిర్లక్ష్యం చేశాయి. ప్రస్తుతం వై.ఎస్ జగన్ ప్రభుత్వంలో మళ్లీ ఈ రహదారి ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి.

పూర్తి నాణ్యతతో పనులు



ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి రైల్వేస్టేషన్ వరకు చేపడుతున్న రహదారి ఆధునికీకరణ పనులు నెలాఖరులోగా పూర్తవుతాయి. పూర్తి నాణ్యతా ప్రమాణాలతో పనులు జరిగేలా చూస్తున్నాం. సెంట్రల్ డివైడర్ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. పనులు పూర్తయితే ఈ రహదారి మీదుగా రాకపోకలు సాఫీగా జరుగుతాయి.

–వి.ఆర్ రవి శంకర్, డీఈఈ, వీఎంఆర్‌డీఏ

పట్టణానికి నూతన శోభ



ఆధునికీకరణ పనులు చేస్తున్న రైల్వేస్టేషన్ రోడ్డు పట్టణానికే నూతన శోభను తీసుకువస్తోంది. నేను రోజూ ఈ రహదారిపై మీదుగానే రాకపోకలు సాగిస్తుంటాను. 40 రోజుల క్రితం ప్రారంభమైన పనులు చకచకా జరిగిపోతున్నాయి. ఇంత తొందరగా పనులు జరుగుతాయనుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కూడా బాగా జరుగుతోంది.

–కటారి పద్మ, ప్రైవేటు ఉద్యోగి, గాంధీనగర్, యలమంచిలి

ప్రభుత్వానికి ధన్యవాదాలు



పట్టణంలో ముఖ్యమైన రహదారుల్లో ఒకటైన రైల్వేస్టేషన్ రోడ్డు విస్తరణ పనులు చేపట్టడం అభినందనీయం. రహదారి విస్తరణ పనులను స్వల్ప కాలంలోనే పూర్తి చేయడం రాష్ట్ర ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం. ఈ ప్రభుత్వ హయాంలో మా కుటుంబానికి సంక్షేమ పథకాల లబ్ధి కూడా చేకూరింది. అభివృద్ధి పనులు కూడా వేగవంతంగా జరుగుతున్నాయి. సీఎం వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, స్థానిక ఎమ్మెల్యే కన్నబాబుకు ధన్యవాదాలు.

–షేక్ ఆషియా, రైల్వేస్టేషన్ రోడ్డు, యలమంచిలి

క్లుప్తంగా

తోటాడ శ్మశానవాటిక అభివృద్ధికి చర్యలు



మాట్లాడుతున్న తోటాడ సర్పంచ్ మంగవేణి

మునగపాక : తోటాడ శ్మశానవాటిక అభివృద్ధికి తగు చర్యలు తీసుంటున్నామని సర్పంచ్ దొడ్డి మంగవేణి తెలిపారు. తోటాడ సచివాలయంలో సోమవారం పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోలేని శ్మశానవాటిక అభివృద్ధిపై ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ముందుగా ప్రహరీ నిర్మించి గేటు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత దొడ్డి కోటేశ్వరరావు, ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి కాండ్రేగుల లక్ష్మీనారాయణ, వార్డు సభ్యులు రమేష్‌నాయుడు, నాగలదేవి అప్పారావు, కోరిబిల్లి లక్ష్మి, బుద్ద రవి, మళ్ల రవి, మళ్ల మహలక్ష్మినాయుడు, పొలినాటి మహలక్ష్మినాయుడు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యం మేరకు పనిచేయాలి



మాట్లాడుతున్న డాక్టర్ వెంకటేష్

రాంబిల్లి : వైద్య సిబ్బంది, సచివాలయ ఏఎన్ఎంలు ప్రభుత్వ లక్ష్యం మేరకు పనిచేయాలని దిమిలి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఆర్.వెంకటేష్ అన్నారు. ఈ పీహెచ్‌సీ వద్ద సోమవారం ఆయన వైద్య సిబ్బంది , సచివాలయ ఏఎన్ఎంలతో సమావేశం నిర్వహించారు. పీహెచ్‌సీలో కాన్పులు జరిగేలా చూడాలన్నారు. పారదర్శకంగా ఇమ్యునైజేషన్ కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా ప్రజలు పౌష్టికాహారం తీసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. వైద్యురాలు శ్రావణి, హెల్త్ సూపర్‌వైజర్ సీహెచ్ ధనరాజు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ, టీబీపై అవగాహన



లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో గ్రామంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం

పాయకరావుపేట : గుంటపల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాలతో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో నిర్వహించారు. వైద్యులు వి.ఎస్ సౌందర్య, వైద్య సిబ్బంది 140 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. హెచ్‌ఐవీ, టీబీ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లింక్ వర్కర్ స్కీం డిఆర్ పి గోవిందరావు, ప్రతినిధి జి.హెచ్.నర్సింగరావు, డిస్ట్రిక్ట్ రిసోర్సు పర్సన్ గోవిందరావు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం



బాధిత కుటుంబానికి సాయం అందజేస్తున్న యాదవ సంక్షేమ సంఘ నేతలు

మునగపాక: అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి అండగా ఉంటామని యాదవ సంక్షేమ సంఘ నేతలు స్పష్టం చేశారు. మండలంలోని నారాయుడుపాలెం గ్రామంలో ఇటీవల పూరిల్లు అగ్నికి ఆహుతికావడంతో సర్వం కోల్పోయిన బాధితులను ఆదుకునేందుకు సోమవారం అనకాపల్లి జిల్లా యాదవ సంఘం ద్వారా రూ.10వేలను బాధితులు రవితేజ, సన్యాసమ్మలకు సాయంగా అందజేశారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని సంఘ జిల్లా అధ్యక్షుడు బర్నికాన రామారావు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సబ్బి శ్రీనివాసరావు, సంఘ గౌరవ అధ్యక్షులు బర్నికాన నరసింహమూర్తి, సంఘ నాయకులు బోరా సోమునాయుడు, మొల్లి ప్రసాద్, బందం వెంకటరమణ, కొయ్య రాజు, కారుకొండ అప్పలరాజు, పల్లా సన్యాసిరావు , చిన పైడయ్య పాల్గొన్నారు.

సంక్షేమం జగన్‌తోనే సాధ్యం..



నీలిగుంటలో వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగులు



అన్నవరంలో డా.అంబేద్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే జోగులు

కోటవురట్ల: రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సంక్షేమం అందేలా చేస్తూ అభివృద్ధి పథంలో పయనించేలా కృషి చేస్తున్న గొప్ప నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలలో ఆయన సోమవారం పాల్గొన్నారు. అన్నవరం, రామచంద్రపాలెం, నీలిగుంట, కె.వెంకటాపురం, పందూరు గ్రామాల్లో పర్యటించి రూ.1.64 కోట్లతో నిర్మించిన సచివాలయం, ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్, కమ్యూనిటీ హాల్, సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. అన్నవరంలో డా.బిఆర్.అంబేడ్కర్, డా.బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో చంద్రబాబు పాలన చూశారు, ఏ పథకం కావాలన్నా జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లు అరిగేలా తిరగాల్సి వచ్చేదన్నారు. ఇపుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఏ ఒక్కరూ కూడా ఇల్లు కదలకుండానే సంక్షేమం అందుతోందన్నారు. వలంటీరు వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని, వలంటీర్లు సేవా గుణంతో సంక్షేమాన్ని ఇంటికే అందిస్తున్నారని పేర్కొన్నారు. అటువంటి వలంటీర్లపై చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ విషం కక్కారని, ఇపుడు ఎన్నికలు సమీపిస్తున్న వేళ మళ్లీ వలంటీర్లపై కపట ప్రేమ చూపిస్తున్నారని విమర్శించారు. సీఎం జగన్‌కు తెలిసింది ఒకే ఒక్కటి.. అది పేద ప్రజలందరికీ మంచి చేయాలనే తపన మాత్రమే అన్నారు. ప్రతీ గ్రామంలో రూ.కోట్లు వెచ్చించి సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు, డిజిటల్ లైబ్రరీలు, అంగన్‌వాడీ కేంద్రాలు నిర్మించి పాలన ప్రజల ముంగిటకే తీసుకొచ్చారని అన్నారు. నవరత్నాల సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు చేరేలా సీఎం జగన్ 125 సార్లు బటన్ నొక్కారన్నారు. మళ్లీ ఆయన సీఎం అయితేనే రాష్ట్ర ప్రజలకు సంక్షేమం పారదర్శకంగా అందుతుందన్నారు. అందుకోసం రెండు బటన్లు నొక్కాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రజలంతా విజ్ఞతతో ఆలోచన చేయాలని, ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డిని ఎన్నుకోవాలన్నారు. ఎంఎస్ఎంఈ చైర్మన్ డి.వి. సూర్యనారాయణరాజు మాట్లాడుతూ ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం చేయని విధంగా సీఎం జగన్ ప్రభుత్వం ప్రజలకు ఎంతో మేలు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్ సీతారామరాజు, జెడ్పీటీసీ సిద్దాబత్తుల ఉమాదేవి, ఎంపీపీ శింగంపల్లి అప్పలనాయుడు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్, మండల పార్టీ అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు, సర్పంచులు ఎ.సుబ్బలక్ష్మి, పరదేశమ్మ, కె.వరహాలబాబు, సిహెచ్.జగదీష్, కె.శివకుమార్, కె.అప్పారావు, ఎస్.గోపాలకృష్ణ, పావని, ఎంపీటీసీలు రమణమ్మ, పెట్ల రాంబాబు, కాళ్ల రత్నం, పార్టీ నాయకులు సిద్దాబత్తుల సత్యనారాయణ, శెట్టి రమణ, ఎస్.కిషోర్, సిహెచ్.వెంకట్, ఎ.రాజులనాయుడు, ఎ.బాబ్జీ, కన్నబాబు, ఎస్.వి.రమణమూర్తి, జి.నానిబాబు, పైల నాని, సన్యాసినాయుడు పాల్గొన్నారు.

పంచాయతీ రోజువారీ ఆశీలు వేలం పాట

పాయకరావుపేట : పాయకరావుపేట గ్రామ పంచాయితీలో రోజువారీ ఆశీలు వేలం పాట నిర్వహించడం జరిగిందని ఈవోఆర్‌డీ సిహెచ్ చంద్రశేఖర్ తెలిపారు. రోజువారీ ఆశీలు ప్రభుత్వం నిర్ణయించింది. రూ.6.82 లక్షలు కాగా తునికి చెందిన ఇరిగిరి శ్రీలేఖ రూ.6.65 లక్షలకు పాడినట్టు తెలిపారు. నిర్ధారించిన రేటు కన్నా తక్కువ పాట పాడడంతో జిల్లా పంచాయతీ అధికారులకు తెలియజేయడం జరుగుతుందన్నారు. అదే విధంగా మేకల కమేళా రూ.50 వేలకు వెళ్లిందన్నారు. చేపల మార్కెట్, చెట్లు ఫల సాయం వేలం పాటను వాయిదా వేయడం జరిగిందన్నారు. ఈ వేలం పాటలో పంచాయితీ కార్యదర్శి జె.చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ వేడుకలు

ఎస్.రాయవరం: మండల కేంద్రంలో మంగళవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించనున్నట్టు అనకాపల్లి జిల్లా పార్టీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు తెలిపారు. 13 ఏళ్లుగా ఎన్నో ఆటుపోటులను ఎదుర్కొని పేదవాడి పక్షాన అండగా నిలబడిన ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీ అని అన్నారు. 14 ఏట అడుగుపెడుతున్న సందర్భంగా ఎస్.రాయవరం వైఎస్సార్ విగ్రహం వద్ద ఆవిర్భావ వేడుకలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు హాజరు అవుతారన్నారు. అనంతరం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయంతో సమావేశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా పార్టీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ హాజరు అవుతారన్నారు.

సీతారాముల విగ్రహాల ఏర్పాటుకు విరాళం



సర్పంచ్ అప్పలనర్సకు విరాళం చెక్కు అందిస్తున్న దొరైస్వామి

రాంబిల్లి: మామిడివాడ శివా రు కలవలపల్లి గ్రామంలో సీతారాముల విగ్రహాల ఏ ర్పాటు కోసం బ్రాండిక్స్ ఇండియన్ పార్టనర్ దొరైస్వామి రూ.1.5 లక్షలు విరాళం అందజేశారు. ఈ మేరకు ఆయ న సోమవారం చెక్కును సర్పంచ్ ఎం.అప్పలనర్స, గ్రామ వైఎస్సార్‌సీపీ నేత ఎస్.సన్యాసిరావుకు అందించారు. గ్రామాల్లో ఐక్యత, ఆధ్యాత్మికత విరజిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బి.భాస్కరరావు, చినమ్మలు, మహాలక్ష్మినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల బాండ్ల వివరాలు వెల్లడించాలని ఆందోళన



మునగపాక ఎస్‌బీఐ ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఎం సభ్యులు

మునగపాక : ఎన్నికల బాండ్ల వివరాలు ప్రకటించాలని కోరుతూ సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో మునగపాక ఎస్‌బీఐ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ గత నాలుగేళ్లలో అమ్మిన బాండ్లు, వాటిని కొనుగోలు చేసిన వారి సమాచారాన్ని ఎన్నికల సంఘానికి మార్చి 6వ తేదీలోగా బ్యాంక్ అందించాలని అలాగే సంబంధిత వివరాలను మార్చి 13లోగా బహిర్గత పరచాలని సుప్రీంకోర్టు తీర్పులో ఆదేశించిందన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడంలో ఎస్‌బీఐ విఫలమైందన్నారు. ఆందోళనలో సీపీఎం నాయకులు మహేశ్వరరావు, బ్రహ్మాజీ, జగ్గప్పారావు, పెంటకోట సత్యనారాయణ, లక్ష్మణరావు పాల్గొన్నారు.

పల్లెల్లో అభివృద్ధి సంబరాలు

- నూతన సచివాలయ భవనం, రహదారులను ప్రారంభించిన ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే కన్నబాబు



గణపర్తిలో రోడ్డు ప్రారంభిస్తున్న ఎంపీ డాక్టర్ సత్యవతి,ఎమ్మెల్యే రమణమూర్తిరాజు



గణపర్తిలో పర్యటిస్తున్న అనకాపల్లి ఎంపీ సత్యవతి,ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక : మండల వ్యాప్తంగా సోమవారం పండగ వాతావరణంలో పలు చోట్ల ప్రారంభోత్సవాలు ఘనంగా జరిగాయి. కోట్లాది రూపాయలతో నిర్మించిన పలు భవనాలను ఎంపీ డాక్టర్ సత్యవతి, ఎమ్మెల్యే రమణమూర్తిరాజు (కన్నబాబు) ప్రారంభించారు. గ్రామాలాభివృద్ధే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతి అన్నారు. పల్లపు ఆనందపురంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, గణపర్తిలో పలు రహదారులను ఎమ్మెల్యే రమణమూర్తిరాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సేవలందిస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేయాలన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ జయలక్ష్మి, జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ, సర్పంచ్‌లు చదరం నాయుడు, సూరప్పారావు, సచివాలయ కన్వీనర్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

పేకాడుతున్న ముగ్గురిపై కేసు

యలమంచిలి రూరల్ : తురంగలపాలెం గ్రామంలో పేకాడుతున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు యలమంచిలి రూరల్ ఎస్ఐ పైల సింహాచలం సోమవారం రాత్రి మీడియాకు తెలిపారు. నిందితుల వద్ద నుంచి రూ.2650 నగదు స్వాధీనపర్చుకున్నామన్నారు. పేకాట, జూద క్రీడలు నిర్వహించినా, ఆడినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

మునగపాక : ఒంపోలులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. గ్రామంలో మద్యం అమ్ముతున్నట్టు అందిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ప్రసాదరావు తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో 14 మద్యం సీసాలతో వ్యక్తిని పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు ప్రసాదరావు తెలిపారు.

29 మద్యం బాటిళ్లు స్వాధీనం

యలమంచిలి రూరల్: జంపపాలెం గ్రామంలో అక్రమంగా మద్యం బాటిళ్లు కలిగి ఉన్న మణికంఠ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్టు సోమవారం రాత్రి యలమంచిలి రూరల్ ఎస్ఐ పైల సింహాచలం తెలిపారు. అతని వద్ద 29 మద్యం క్వార్టర్ బాటిళ్లు స్వాధీనపర్చుకున్నామన్నారు.

ప్రజల కనీస అవసరాలు తీర్చడమే ప్రభుత్వ లక్ష్యం



బ్రిడ్జిల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం : ప్రజల కనీస అవసరాలు తీర్చడమే తమ లక్ష్యమని యలమంచిలి ఎమ్మెల్యే ఉప్పలపాటి రమణమూర్తిరాజు అన్నారు. అచ్యుతాపురం, మునగపాక, కశింకోట మండలాల సరిహద్దులను కలుపుతూ నిర్మించిన తారురోడ్డులో భాగంగా అవసరమైన మూడు చోట్ల బ్రిడ్జిల నిర్మాణానికి ఆయన ఎంపీ సత్యవతితో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అచ్యుతాపురం మండలం పరిధిలో రెండు బ్రిడ్జిల నిర్మాణానికి రూ.3.80 కోట్లు నిధులు మంజూరు చేశారు. ఎంపీ సత్యవతి, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, ఎంపీపీ కోన సంధ్య బుజ్జి, మునగపాక జెడ్పీటీసీ సోము సత్యనారాయణ, మునగపాక ఎంపీపీ జయలక్ష్మి పాల్గొన్నారు.

రేపు అగ్రిగోల్డ్ బాధితుల బైక్ ర్యాలీ

అనకాపల్లి: అగ్రిగోల్డ్ బాధితులకు హామీ మేరకు డిపాజిట్లు తిరిగి చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం పట్టణంలో జరిగే బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కరణం మాణిక్యాలరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అగ్రిగోల్డ్ బాధితులు అందరికీ డిపాజిట్లు తిరిగి చెల్లిస్తామని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఆయన కోరారు. ఈ బైక్ ర్యాలీలో బాధితులందరూ పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

సంక్షేమాభివృద్ధికి మళ్లీ జగనన్నే గెలవాలి

- ఎమ్మెల్యే రమణమూర్తిరాజు
- పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు, సుకుమారవర్మ



మూలపేటలో రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు



పాటిపల్లిలో మంచినీటి ట్యాప్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు కోరారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. రాజుపేట నుంచి పాటిపల్లికి వెళ్లే రోడ్డు అలాగే జల్‌జీవన్ మిషన్ పథకం, మూలపేట, పల్లపు ఆనందపురం, చూచుకొండ, గణపర్తి, తిమ్మరాజుపేట, నాగవరం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఆయన సోమవారం ప్రారంభోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడంతో పాటు కోట్లాది రూపాయలతో అభివృద్ధి జరుగుతుందన్నారు. సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థ అందుబాటులోకి వచ్చాక ప్రజలకు సకాలంలో సేవలందుతున్నాయన్నారు. రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు జరగాలంటే ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా చేసుకోవాలని తద్వారా మరింత సంక్షేమం అందుతుందన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ బోజా లక్ష్మీ శ్రీనివాసరావు, సర్పంచ్‌లు ఆడారి కృష్ణవేణి, భీశెట్టి గంగప్పలనాయుడు, చదరం నాయుడు, దొడ్డి సూరప్పారావు, భీశెట్టి మంగలక్ష్మి, కర్రి అప్పయమ్మ, బీసీ సెల్ మండల అధ్యక్షుడు కాండ్రేగుల జగన్, పార్టీ నేతలు అప్పలనరసమ్మ, ఇల్లా శిరీషా, రామ్మోహనరావు, పిల్లి అప్పారావు, సరిసా శ్రీనివాసరావు, మొల్లేటి చంద్ర, నరసింహనాయుడు, చదరం అప్పలనాయుడు, మరిసా రమణ పాల్గొన్నారు.

జగన్‌ను సీఎం చేయడమే అందరి ధ్యేయం



ఎన్నికలకు 'మేం సిద్ధం...మా బూత్ సిద్ధం'అంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కోటవురట్ల: ముఖ్యమంత్రి జగన్ ఐదేళ్ల పాలనలో ప్రజలకు ఏం చేశారో ప్రతి కుటుంబానికి అర్ధమయ్యేలా వివరించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ కోరారు. బూత్ కన్వీనర్లతో సోమవారం ఆయన ×మేం సిద్ధం...మా బూత్ సిద్ధం० కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అందరి ధ్యేయం జగన్‌ను సీఎంగా చేయడమే అన్నారు. ఈ ఎన్నికలతో టీడీపీ తుడిచిపెట్టుకుపోతుందని విమర్శించారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు జగన్‌ను ఎదిరించలేక పొత్తులంటూ అందరి కాళ్లు పట్టుకుని ప్రాధేయపడే పరిస్థితికి దిగజారిపోయాడన్నారు. ప్రజలను కొత్తగా ఎలా మోసం చేయాలో తెలీక అందరినీ పొత్తులంటూ కలుపుకొని గుంపుతో వస్తున్నాడని అన్నారు. 2014లో చంద్రబాబు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను ఎలా మోసం చేశారో ప్రజలకు గుర్తు చేయాలన్నారు. సీఎం జగన్ ఐదేళ్ల పాలనలో అన్ని హామీలను నెరవేర్చడమే కాకుండా ప్రతి ఇంటి సభ్యుడిగా అవ్వా, తాతలకు తోడుంటూ అక్కా చెల్లెమ్మలకు ఆసరాగా ఉంటూ వారి సంక్షేమానికి కృషి చేశారని అన్నారు. బూత్ కన్వీనర్లు, వలంటీర్లు తమ పరిధిలోని ప్రతి కుటుంబానికి ప్రభుత్వం చేసిన సంక్షేమాన్ని వివరించడమే కాకుండా చంద్రబాబు ఎంత మోసకారో వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, ఎంఎస్ఎంఈ చైర్మన్ డి.వి.సూర్యనారాయణరాజు, జెడ్పీటీసీ సిద్దాబత్తుల ఉమాదేవి, పార్టీ జిల్లా కార్యదర్శి యల్లపు కుమార్‌రాజా, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్, మండల పార్టీ అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు, పార్టీ నాయకుడు సిద్దాబత్తుల సత్యనారాయణ పాల్గొన్నారు.